# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# పోయేది ప్రాణమైతే??

" ఈ సిటీకి ఏమవుతోందో చెప్పడానికి లేదు" అంది ఆఫీసుకు లేట్ గా వచ్చిన చిరాకుతో పెద్ద శబ్దంతో బాగ్ ని తన టైబిల్ మీద పెడుతూ అంది యామిని.

" ఈ నగరానికేమయింది? ఒకవైపు నుసి, మరొకవైపు పొగ" అంటూ ఈ మధ్యన సినిమా హాళ్ళల్లో తరచుగా కనిపిస్తున్న ప్రకటనని అనుకరించబోయిన స్నేహితురాలు గౌతమిని మింగేసేటట్టు చూసింది.

" బాబోయ్, అంత చూపుల్తోనే తినెయ్యకు తల్లీ! ఏమయ్యింది? ట్రాఫిక్ బాగా ఎక్కువ ఉందా?" అంది గౌతమి. యామిని మూడ్ వల్లనూ, పనివల్లనూ అప్పుడాగిపోయిన సంభాషణ మళ్ళీ లంచ్ సమయంలో మొదలయింది.

" నీలా ఆఫీసుకు నాలుగడుగుల దూరంలో ఆఫీసు ఉంటే నేను నిదానంగా వచ్చి ఇలాంటి వెర్రి ప్రశ్నలు వేద్దును. ట్రాఫిక్ బాగా ఎక్కువగా ఉందాట? ఒక్కరోజు, ఒక్కరోజంటే ఒక్కరోజు నాలా పదిహేను కిలోమీటర్ల దూరాన్నుంచి రా, తెలుస్తుంది ఈ నగరానికేమయ్యిందో?" అంది యామిని.

" సరేలే, ఇది రోజూ ఉండేదే కదా" అంది గౌతమి వాతావరణాన్ని తేలిక చెయ్యడానికి ప్రయత్నిస్తూ. " నాకు కూడా చాలా కష్టంగా ఉంది, నేను మళ్ళీ మా ఊరుకే వెళ్ళిపోదామనుకుంటున్నాను వీలుంటే" అన్నాడు ఈ మధ్యనే పూనే నించి వచ్చిన ప్రసాద్ మంకర్.

స్వంత ఊరిని మరిచిపోలేక అస్తమానూ మా పూరు, మాపూరు అంటూ ఉంటాడు ప్రసాద్. అందుకే నవ్వింది గౌతమి అతన్ని చూసి.

" నవ్వకు గౌతమీ, నిజంగానే ఈ ట్రాఫిక్ చూస్తే ఎంత టెన్షన్ వస్తుందో తెలుసా? పెరుగుతున్న వెహికల్స్ వల్ల అన్ని ఊర్లలోనూ ట్రాఫిక్ పెరుగుతోంది. నిజమే, కానీ మరీ ఇంతగానా? ఇక్కడా, అక్కడా అని లేదు. ఎక్కడ చూసిన ఒకటే రష్. ఏ రోడ్డుచూసినా జామే కదా. మనందరం ఎలా భరిస్తున్నామో? ఎందుకు భరిస్తున్నామో కూడా టెలియదు నాకు" అన్నాడు అతను కోపంగా.

" ప్రసాద్, నువ్వు చెప్పేది నిజమే, కాదనను. కానీ దానిలో మన తప్పు మాత్రం లేదా? మనిషికొక కారు, ఇంటికి కనీసం మూడు నాలుగు వాహనాలు. ఇవి చాలనట్టు కంపెనీ బస్సులూ, టాక్సీలు, ఆటోలు, టూ వీలర్లు, పొద్దున్నా సాయంత్రం అదనంగా స్కూల్ బస్సులూ. మధ్యలో భూతాల్లా భయపెట్టేలారీలు, ఇన్ని వాహనాలను రోజూ మనమే వీధి మీదకు చేరుస్తున్నాము. మొన్నెక్కడో చదివాను కొటేషన్ – మనం వాహనాల్ని రవాణా చేస్తున్నాము, మనుషులని కాదూ అని. ఎంత నిజమో నువ్వే చూడు! మనిషికోకారుచొప్పున వెళ్తూ ఉంటే రోడ్ల మీద వెళ్తున్నది కార్లా? మనుష్యులా?" అంది గౌతమి ఆవేశంగా.

" ఒహో! ఒక్క రోజు కూడా ట్రాఫిక్ బాధ పడకుండానే అమ్మగారింత లెక్చర్లిస్తున్నారే, రోజూ వచ్చే మేమేమనుకోవాలి? అనుభవిస్తే తెలుస్తుంది" అంది యామిని కోపంగా. వాళ్ళ అమ్మా, నాన్నా స్వంత ఇంటిని విడిచి రారు, మంచి జీతం, మంచి కంపెనీ, ముఖ్యంగా మనసుకు నచ్చే పనీ చూస్తూ ఒదులుకోలేదు. అలా ఆమె రోజూ ట్రాఫిక్ బారిన పడుతూ, లేస్తూ ఆఫీసుకు పరుగులు తీస్తూనే ఉంది గత నాలుగేళ్లుగా.

" నానాటికీ తీసికట్టు నాగంభొట్లు" అన్న చందంగా తయారవుతున్న ఆ నగరాన్ని, ట్రాఫిక్ నీ చూస్తూ విరక్తి చెందడం తప్ప మరేం చెయ్యాలో తెలియని ఎన్నో వేలమందిలో తను కూడా ఒకర్తి. అందుకే ఆఫీసుకు కూటవేతు దూరంలో ఉన్నవాళ్ళెవరిని చూసినా ఆమెకి రవ్వంత అసూయ. అదెప్పుడూ మాటల్లో ప్రదర్శిస్తూనే ఉంటుంది.

" అలా అనకు యామినీ, ఇలాంటివి అందరికీ అనుభవం అవుతూనే ఉంటాయిరోజూ ఎదురవ్వక్కరలేదు, ఒకటో రెండో అయినా చాలు జీవితాంతం గుర్తుండడానికి" అంది గౌతమి నెమ్మదిగా.

అలా అంటున్నప్పుడు ఆమె కళ్ళల్లో ఒకటే దృశ్యం కదులుతోంది. చేతుల్లో పాపని ఎత్తుకుని తన ముందు పరుగెడుతున్న ఒక మనిషి, ఒక తండ్రి.. ఎప్పటికీ మర్చిపోలేదు ఆ రోజుని, ఆ పరుగునీ, ఆ నడకనీ..ఆ గంటలనీ..

--------------------

"వచ్చే మూడు రోజులు సెలవులు గౌతమీ! మన ఊరిలో ఒకరోజు సెలవు వస్తేనే ఎవరూ ఇళ్ళల్లో ఉండరు. అలాంటిది మూడురోజులంటే సిటీ అంతా బయటకే పరుగులు తీస్తారు. నా మాట విని టాక్సీ ముందే పిలుచుకో, ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఇంట్లోంచి బయలుదేరు. నాకు మీటింగ్ పూర్తి అయ్యి, ఆ మూలనుంచి వచ్చి నిన్ను స్టేషన్ లో దింపే టైముండదు. అందుకే ఇంతగా చెప్తున్నాను, అసలే స్టేషన్ దూరం మనకి, ఆపైన సెలవులు . కంటోన్మెంట్ స్టేషన్ కి కనీసం పదిహేను నిమిషాలు ముందుగా వెళితే మంచిది. నీ కోచ్ ప్లాట్ ఫార్మ్ కి ఆ చివరన వస్తుంది. టైము లేకపోతే ఎక్కడం కష్టం " అంటూ చిన్న సైజు లెక్చర్ ఇచ్చాడు భార్గవ్.

"నాకు తెలుసు కదా, ముందే బయలుదేరతాలే, ఒక్క రోజు ఇంట్లో ఒక అరగంట ఎక్కువ గడుపుదామంటే నువ్వు ముందే హడావిడి పెడుతున్నావు" అంది ముద్దుగా భర్త మీద విసుక్కుంటూ.

" బంగారం, నీ మంచి కోసం చెప్పాను. ఈ భర్త మాట విన్నావా సరే, లేదా నీ పాట్లు" అంటూ ఏదో చెపబోతున్న భార్గవ్ నోరు మూసింది నవ్వుతూ.

" సరిగ్గా నాలుగున్నరకల్లా బయలుదేరు.మర్చిపోకు. టైముంది కదా అని మధ్యాహ్నం నిద్రపోకు" అంటూ వంద సార్లు చెప్పాడు.

అతన్ని పంపించి తలుపు వేసుకుని హాయిగా మంచమ్మీద అడ్డంగా పడుకుని పుస్తకం చదువుకుంది పెద్దగా పని లేకపోవడంతో. రెండు మూడు మెయిల్స్ ఉంటే చూసుకుని జవాబులు రాసి లాప్ టాప్ కట్టేసింది. నెమ్మదిగా కూనిరాగాలు తీసుకుంటూ స్నానం చేసి తయారయింది. మధ్యాహ్నం భోజనం చేసేసరికి రెండు అయింది. నిద్రపోవాలన్న కోరిక బలవంతంగా ఆపుకుని టీ.వీ చూసింది. మూడున్నరకి టాక్సీ బుక్ చేసుకుంది.

నాలుంపావుకల్లా వచ్చాడు టాక్సీ అతను. రాగానే అన్నీ సరి చూసుకుని నాలుగున్నర, నాలుగూ నలభై మధ్యలో టాక్సీ ఎక్కింది.

" రోడ్లన్నీ జాం అయ్యాయి అమ్మ, ఎటువైపునించి వెళ్దాం?" అన్నాడతను

" ఏటువైపునించైనా సరే, తొందరగా వెళ్ళాలి. ట్రాఫిక్ తక్కువ ఉన్న వైపునించి తీసుకెళ్ళు" అంది.

వెర్రిదాన్ని చూసినట్టు చూశాడు. 'ఇప్పుడు నేను చెప్పింది ఈవిడకర్థం కాలేదా?' అన్న అర్థం కనబడేలా.

అతను చెప్పింది నిజమే. రోడ్లన్నీ మామూలుగా ఉండవలసిన దానికన్నా రెట్టింపు వాహనాలతో నిండి ఉన్నాయి. " ఎక్కడికెళతారో? ఇంతమంది ప్రతిరోజూ? " అనుకుంది తనలో తానే.

మళ్ళీ అంతలోనే " తను వెళ్ళడం లేదూ? అలాగే అందరూనూ" అనుకుంది. వెంటనే ఆమెకి వాళ్ళ అమ్మమ్మ గుర్తొచ్చింది.

" మా చిన్నప్పుడు ప్రయాణాలంటే మాటలా? మరచెంబు దగ్గరనించీ అన్నీ పట్టుకుని వెళ్తే కానీ కుదరదాయె, అందుకే ఏ మూడునాలుగేళ్ళకో ఒకసారి ప్రయాణం తలపెట్టడం. ఇప్పుడు మీకు కష్టమేముందర్రా? చేతిలో డబ్బో ఆ క్రికిరి ( క్రెడిట్ కార్డ్ అనడం రాదావిడకి) కార్డో పెట్టుకుని ఝుమ్మంటూ వెళ్ళిపోతారు. మీ సుఖాలు మాకెక్కడివీ? మా అమ్మగారింటికి వెళ్ళాలన్నా ఆ ఎడ్లబండిలో కూర్చుని ఒళ్ళు హూనమైపోయేది తప్ప ఓ పట్టానా వచ్చేదా? " అంటుంది.

" మాకూ అంతేలే అమ్మమ్మా! కారుల్లో కూర్చున్న మా నగరాల రోడ్ల మీద ఒళ్ళు హూనమే" అంటుంది తను.

గౌతమి ఆలోచనని భంగపరుస్తూ, " బ్రిడ్జ్ మీద చాలా జాముందమ్మా, కిందనించి తీసుకుపోతా, రోడ్డు కొంచం బావుండదు కానీ తొందరగా వెళతాము" అన్నాడు బ్రిడ్జ్ కిందనించి చిన్న సందులోకి పోనిస్తూ.

చేసేది లేక తలూపింది. ఈలోపున తనెప్పటినించో మాట్లాడాలనుకుంటున్న స్నేహితులతో మాట్లాడడం మొదలుపెట్టింది. ఆ మాటల్లోనే ట్రాఫిక్ అతి నెమ్మదిగానూ, గడియారం వేగంగానూ కదలడం గమనించ లేదు. "బాప్ రే, ఐదున్నర దాటింది అప్పుడే, ఇంక గంట మాత్రమే ఉంది టైము" అంటూ, " కొంచం తొందరగా వెళదామా" అని డ్రైవర్ ని అడిగింది. అతనూ పాపం వీలైనన్ని తంటాలు పడుతున్నాడు గతుకుల్నీ, గుంటల్నీ తప్పించుకుంటూ హైరానా పడుతూ.

" అబ్బా " అంది కుదుపులో పడినందువల్ల పైకి ఎగురుతూ. అప్పుడే వచ్చింది భార్గవ్ ఫోన్.

" ఎక్కడున్నావ్?" అంటూ.

" అయ్యో, ఇంకా అక్కడేనా? చూడు కొంచం తొందరగా వెళ్ళమని చెప్పు అతనికి. లేకపోతే నీ ట్రెయిన్ మిస్ అవుతుంది" అంటూ మళ్ళీ మీటింగ్ లోకి వెళ్ళిపోయాడు. ఆరుదాటిపోయింది టైము.

" స్టేషన్ ఇంకా నాలుగు కిలోమీటర్లేనమ్మా, వెళ్ళిపోతాము " అన్నాడు డ్రైవర్. ఉన్నట్టుండి మరిన్ని కార్లూ, స్కూటర్లూ కనిపించాయి గౌతమికి.

"ఇదేమిటి? ఇక్కడ మరీ ఎక్కువగా ఉంది రష్?" అని ఆమె అంటూ ఉండగానే టాక్సీ ఆపేసి కూర్చున్నాడు అతను. రెండు మెయిన్ రోడ్లకీ మధ్య ఉన్న చిన్న రోడ్డుమీద ఆగింది ఆమె ఎక్కిన టాక్సీ. ముందున్న వీధిలో ఏదో పండగ సంబరమూ, వెనకున్న వీధిలో ఏదో నిరసన ప్రదర్శనా జరుగుతున్నాయి. నిరసన కారుల సంఖ్య చాలా చిన్నది, మౌనంగా జండాలు పట్టుకుని రోడ్డుకి సగం వైపు ఆక్రమించుకుని నెమ్మదిగా వెళ్తున్నారు వాళ్ళు. వారు వదలగా మిగిలిన కొంత రోడ్డులో వెళ్ళడానికి వాహనాలు పోటీపడడంవల్ల అక్కడంతా జాం అయిపోయింది. వాళ్ళని తప్పించుకోవడానికే టాక్సీ అతను ఆ సన్నరోడ్డులోకి దారితీశాడు. అప్పుడు కానీ వాళ్ళు గమనించలేదు ముందున్న వీధిలో జరుగుతున్న ఊరేగింపునీ, హడావిడినీ. దానికి ముందు దారి కనబడకుండా నిలబడిపోయిన మూడు బస్సులు కూడా కారణం.

టైము ఆరూ పది అవుతోంది. మామూలుగా అయితే మూడు నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్ళిపోవచ్చు. కానీ ఇప్పుడు రెండు వైపులా చేరిపోయిన వాహనాల మధ్య నుంచి, ముఖ్యంగా ముందున్న బస్సులని దాటుకుంటూ ఎలా వెళ్ళాలో తెలియలేదు డ్రైవర్ కి కూడా.

గౌతమికి ఏం చెయ్యాలో అర్ధం కాలేదు. ఊరికే టైము చూసుకుంటూ ఉంటే లేనిపోని టెన్షన్ అనీందాకటినించీ చూడలేదు. కానీ " ఆరు పది అయిందమ్మా, మరో పది నిమిషాలు అని చూపిస్తోంది జీ.పీ.ఆర్.ఎస్" అన్న అతని మాటలకి అదిరిపడి టైము చూసింది.

" ఈ హడావుడి మధ్యలోంచి పదినిమిషాల్లో ఎలా వెళ్ళగలం? " అంది కంగారుగా.ఇంతలో వినబడింది సైరన్ మోగించుకుంటూ వచ్చిన ఆంబులెన్స్ శబ్దం.

" ఇప్పుడే ఇది కూడా రావాలా?" అన్నాడు అతను కొంత విసుగ్గా. రోజూ పొద్దున్న లేస్తే వీధిన పడే వారికి ఆ మాత్రం విసుగు అనిపించడం సహజమే అనుకుంటూ చుట్టూ చూస్తూ అంది.

"పాపం అలా అనకు, ఎంతో అవసరం అయితే తప్ప ఆంబులెన్స్ ని పిలవరు కదా?" అతనేమీ మాట్లాడలేదు.

ఎటు చూసినా కార్లు, ఆటోలు, టాక్సీలు, స్కూటర్లూ.. నా నా గందరగోళంగా ఉంది. అష్టదిగ్బంధంలో చిక్కుకుపోయినట్టుగా ముందుకు వెళ్ళలేకా, వెనక్కి రాలేకా అవస్థ పడుతున్నారు స్కూటర్ల వాళ్ళ తో సహా అందరూ. బస్సువాళ్ళు చేసేదేమీ లేక కిందకు దిగి ఆ ఊరేగింపు ఏమిటో, ఎందుకో అని చూస్తున్నారు.

భార్గవ్ కి ఫోన్ చేసింది. మీటింగ్ అయినట్టుంది. ఫోన్ తీశాడు.

" అరే అలాగా? నేను అనుకుంటూనే ఉన్నాను ఇలాంటిదేదో అవుతుందని, ఇవాళ ఈద్ అనుకుంటా. ఇప్పుడేం చేద్దాం? ఒక పని చెయ్యి. టాక్సీ దిగిపోయి కొంచం ముందుకు నడువు, ఆ ఊరేగింపు దాటితే ఆటో దొరుకుతుంది, వంద రూపాయలు అడుగుతాడు. ఇస్తానను. వస్తాడు. కంగారు పడకు, ఊరికే శ్రమ పడకు. పోతే పోయింది, నువ్వు వెళ్ళేసరికి ట్రెయిన్ ఉంటే ఎక్కు, లేదంటే వదిలెయ్. అంతే కానీ రిస్క్ తీసుకోకు" అని గట్టిగా చెప్పాడు.

గౌతమి ఆలోచించడం మొదలుపెట్టింది. " ఇప్పుడు రైలు దొరుకుతుందా లేదా? టాక్సీ దిగి వెళ్ళడం మంచిదా? అదృష్టవశాత్తూ ఎక్కువ సామాను లేదు." ఇలా అనుకుంటూ ఉండగానే ఆంబులెన్స్ కూత దగ్గరకొచ్చింది. స్కూటర్ల వాళ్ళు కొద్దిగా సర్దుకుని దారిచెయ్యడంతో. వచ్చి గౌతమి ఉన్న టాక్సీ పక్కనే ఆగింది. ముందు బస్సులూ, కార్లూ, ఇంక వెళ్ళే మార్గం లేదు. సైరన్ కూస్తూనే ఉంది, ఎవరూ కదిలి దారి ఇవ్వలేని పరిస్థితి. లైట్ వెలుగుతూ ఆరుతోంది. మెల్లిగా ముసురుకుంటున్న చీకటిని పారదోలుతున్నాయి ఊరేగింపులో జనం మోసుకువెళ్తున్న ట్యూబ్ లైట్లు.

ఎక్కడా కదిలే సూచన లేకపోవడంతో " నేను ఇక్కడ దిగిపోతాను, ఆటో ఏదైనా దొరుకుతుందేమో ప్రయత్నిస్తాను. మీరు మీటర్ ఆపేయండి"అని గబ గబా దిగింది.

భుజానికి హేండ్ బాగ్ వేసుకుని చేత్తో చిన్న ట్రాలీ లాక్కుంటూ పరుగులాంటి నడకతో వాహనాల మధ్యనుంచీ వెళ్ళడం మొదలు పెట్టింది. అలవాటు లేని నడక, అనుకోకుండా వేసుకున్న కొత్త హీల్స్ , పైగా చేతితో లాగుతున్న సూట్ కేస్, చాలా ఇబ్బందిగా ఉంది. కానీ తప్పదని వేగంగా నడవసాగింది. ఊరేగింపు రోడ్డు దగ్గర కొచ్చేసరికి ఆమె కి కళ్ళు చెదిరినట్లయింది.

ఇసక వేస్తే రాలనట్టున్న జనం. మగవారు మధ్యలో గుంపులు గుంపులుగా డాన్స్ లు చేస్తున్నారు. మధ్యలో పిల్లలని గాలిలోకి ఎగరే సి పట్టుకుంటూ ఆడిస్తున్నారు. దారికిరువైపులా కర్రలకి కట్టిన ట్యూబ్ లైట్లు పట్టుకుని నడుస్తున్నారు. రోడ్డుకిరువైపులా ఫుట్ పాత్ ల నిండా ఆడవారూ, పిల్లలూ నిలబడి వేడుకలని చూస్తున్నారు. ఒక మూల కొంతమంది కుర్రాళ్ళు ఎందుకో కొట్టుకుంటున్నారు. ఒక కుర్రాడిని మరో నలుగురు వెంటబడి తరుముకుంటూ వచ్చి వీపు మీద గుద్దినట్టుగా కొట్టడం చూస్తే ఆమెకెందుకో తెలియని భయం వేసింది. మెళ్ళో గొలుసూ, చేతిలో ఖరీదైన ఫోనూ సరిగా ఉన్నాయా లేదా అని చూసుకుంటూ వడి వడిగా నడిచింది. ఒక్కనిమిషం 'అది తప్పించుకుని ఎలా వెళ్ళాలా?' అని ఆలోచించింది. ' ఈ రోడ్డు దాటి అవతలవైపుకు వెళ్తే ఆటో దొరకవచ్చు' అనుకుంటూ వడివడిగా నడిచింది.

ఆటోలు ఉండడం చాలా ఉన్నాయి కానీ నడిపేవాళ్ళందరూ సంబరాల్లో పాల్గొనడంలోనో, చూడడం లోనో బిజీగా ఉన్నారు. ఒక్కరూ రానంటున్నారు. ఈ ఊరేగింపు మెయిన్ రోడ్డు మీదుగా వెళుతోంది కనక తాను పక్క రోడ్డులోకి వెళ్ళడం మంచిదని అటువెళ్ళింది. అప్పటికే ఆయసంతోనూ, ఒకరి వెనక ఒకరు తరుముకుంటూ కొట్టుకుంటున్న కుర్రాళ్ళను చూసి భయంతోనూ దమ్ము వస్తోంది ఆమెకి. దానికి తోడు హఠాత్తుగా పెద్ద పెద్ద అంగలతో ఎవరో తన వెనుకే పరిగెడుతున్న శబ్దం రావడంతో మరింత భయం వేసింది ఆమెకి. ఆగి ఉన్న ఆటో దగ్గర డ్రైవర్ కనిపించడంతో ఒక్క క్షణం ఊపిరి తీసుకుని " స్టేషన్ కి " అంటూ అతనికి మరో మాటకి అవకాశమివ్వకుండా ఎక్కి కూర్చుందామని కాలు లోపల పెట్టబోతూ ఉండగానే వెనకే పరిగెడుతున్న ధ్వని దగ్గరగా, బిగ్గరగా వినిపించేసరికి అటు చూసింది తల తిప్పి.

" ఆగండి, ప్లీజ్ ఆటో నాకు" ఇంకేమంటున్నాడో వినబడడం లేదు. చేతుల్లో చిన్న పాపని అడ్డంగా వేసుకుని వేగంగా పరిగెత్తుకుంటూ వస్తున్నాడతను. పాపకేమయిందో తెలీదు కానీ మెడ ఒక పక్కకి వాలేసింది, స్పృహలేనట్టుగా కళ్ళు మూసుకుని ఉంది. అతను వేగంగా వచ్చాడు, ఆయసంతో మాటే కాదు ఊపిరి కూడా రావడం లేదు. జీర పోయిన గొంతుతో " ప్లీజ్ మేడం, నా కూతురు, ఆటో నాకు, హాస్పటల్" అన్నాడు. ఒ ళ్ళంతా కారుతున్న చెమట, తడిసిన నుదిటికి అంటుకుపోయిన జుట్టూ, కళ్ళల్లో తిరుగుతున్న నీళ్ళూ, ఎర్రబడిన ముఖమూ. పరిగెత్తినందువల్లో, కూతురికేమయిందోనన్న బెంగవల్లనో తెలీదు కానీ గట్టిగా కొట్టుకుంటున్న అతని గుండె చప్పుడు ఆమెకి కూడా స్పష్టంగా వినిపించింది. అతన్ని చూసి చలించిపోయింది.

ఆటోలో పెడుతున్న తన కాలిని అప్రయత్నంగా వెనక్కి లాగేసుకుని. " ప్లీజ్ తీసుకువెళ్ళు, పాపని దగ్గరలో ఉన్న హాస్పటల్ కి" అని మాత్రం అనగలిగింది. ఊరేగింపు చూడడానికే అక్కడకొచ్చిన ఆటో అతను కాదనలేనట్టుగా కదిలాడు. పాపని సీటులో పడుకోబెట్టి గౌతమికి దండం పెట్టి క్షణాల్లో ఆటోలో వెళ్ళిపోయాడు అతను.

తృప్తిగా నిట్టూర్చిన ఆమెకె అప్పుడు గుర్తొచ్చింది తన విషయం. ఇంకొక్క ఆటోలేదు ఎక్కడా కనుచూపు మేరలో. ట్రెయిన్ కనీసం పది నిమిషాలైనా లేట్ అయితే తప్ప తను అందుకోవడం అన్నది అసంభవం.

" ఏం చెయ్యాలి? " అనుకుంది. వదిలేసి వెళ్ళిపోవడం చాలా తేలిక. చివరి వరకూ ప్రయత్నించడం కష్టం. అయినా కష్టానికే సిద్ధపడింది. ఎదురుగా వచ్చే ఒకటి రెండు కార్లని లిఫ్ట్ అడిగింది. కానీ అంతలోనే ఈ మధ్య వింటున్న/చదువుతున్న సంఘటనలను గుర్తుచేసుకుని కార్లకంటే స్కూటర్లు మేలని ఎదురుగా వస్తున్న స్కూటర్లని ఆపడానికి ప్రయత్నించింది. ముగ్గురు నలుగురు పట్టించుకోలేదు, ఆపే ప్రయత్నమూ చెయ్యలేదు. అయినా నిరాశ పడలేదు. ఐదో స్కూటర్ అతను ఆపాడు. గబ గబా పరిస్థితి వివరించింది.

" తప్పకుండా తీసుకెళ్తాను మేడం, కానీ స్టేషన్ దగ్గర వన్ వే ఉండడంతో కొద్ది దూరం లో దింపుతాను" అన్నాడు.

ప్రస్తుతానికదే చాలని ఎక్కింది. మరొక ఐదారునిమిషాల్లో స్కూటర్ స్టేషన్ కి కొద్ది దూరంలో ఆగింది. మళ్ళీ పరుగు. " జీవితంలో ప్రతీ దానికీ పరుగే కదా!" అనుకుంది అంత హడావిడిలోనూ. మొత్తానికి ఆమె స్టేషన్ కి చేరేసరికి ట్రెయిన్ ఇంకా రాలేదు. ఒక్క పరుగున ట్రాక్ దాటి తనకు కావలసిన ప్లాట్ ఫారం దగ్గరకి వెళ్ళడమూ, ట్రెయిన్ రావడమూ, తాను ఎక్కడమూ అన్నీ నిమిషాల్లో జరిగిపోయాయ్.

ఒకటే ఆయస పడుతూ ఫోన్ లో భర్తతో మాట్లాడుతున్న గౌతమిని వింతగా చూస్తూ ' నీరు తాగమ్మా" అంటూ బాటిల్ ఇచ్చింది ఎదురుసీటులో ఉన్నావిడ. గడ, గడా తాగి గబ గబా విషయమంతా చెప్పింది భార్గవ్ కి.

" ఓ గాడ్, అంత జరిగిందా! ఎందుకంత రిస్క్, పోతే పోయింది ఒక టికెట్ అన్నా కదా! పోనీలే మొత్తానికి ఎక్కావు కదా. ఇంక రిలాక్స్ అయ్యి, ఎదైనా తిని పడుక్కో హాయిగా' అన్నాడు ఫోన్ పెట్టేస్తూ.

ఇదంతా గుర్తు తెచ్చుకుంటూ స్నేహితులకి చెప్పింది.

" నేను ఇరుక్కున్న అతి పెద్ద ట్రాఫిక్ జాం ఇది, పెద్ద అనేకంటే ఎప్పటికీ మర్చిపోలేని అనడం సరి అయినదేమో. దేవుడి దయవల్ల ఆ ఆటో అతనికి ఇవ్వగలిగాను. ఒకవేళ నేను ఒక క్షణం ముందు వెళ్ళిపోయి ఉంటే? అక్కడ మరొక్క ఆటో కూడా లేదు. అప్పుడతను ఏమయ్యేవాడు? పాప? ఆ చిన్న పాప లేత ముఖం ఇప్పటికీ నా కళ్ళల్లోనే మెదులుతుంది తెలుసా? తెల్లటి గౌన్ వేసుకుని ఏంజెల్ లా ఉంది.

నేను చేరకపోయినా వెళ్ళిపోయేది నా రైలే, తప్పి పోయేది కేవలం ప్రయాణమే. అందుకే భార్గవ్ నాతో పదే పదే జాములో ఇరుక్కుంటే ఊరికే పరిగెత్తి రిస్క్ తీసుకోకు, ఒక్క టిక్కెట్ పోతే పోయింది అన్నాడు, అనగలిగాడు. అదే మాట ఆ పాప తండ్రి కలలోనైనా అనుకోగలడా? అంబులెన్స్ కి దారి ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వాలి అన్న ప్రాధమిక సూత్రాన్ని కూడా అమలుచెయ్యలేమా మనం? ఎంత ఆవేదన పడిఉంటాడు ఆయన? అంబులెన్స్ లోనో, ఇంట్లోనో ఉన్న ఆ తల్లి పరిస్థితి ఊహించగలమా? అక్కడేదైనా అయితే పోయేది ప్రాణం కాదా? ఆరోజు నాకొచ్చినంత కోపం మరెప్పుడూ రాలేదేమో యామినీ! ఉన్న రోడ్లే చిన్నవి, దానినిండా వాహనాలు. అవి చాలనట్టు నిరసనలూ, ఊరేగింపులూ. ఈ నిరసనలన్నీ ఊరంతా తిరిగి చేసుకోవాలా? ఎంత పండగైతే మాత్రం అలా అందరినీ ఎక్కడివాళ్ళని అక్కడ ఆపేసి ఇబ్బంది పెట్టాలా? అని. చెప్పాను కదా తప్పి పోయేది ప్రయాణమైతే పర్వాలేదు, కానీ పోయేది ప్రాణమైతేనో? అన్న ఆలోచనకే నా మనసు భయంతో ఉలిక్కి పడుతుంది."

" అప్పటినించి ఎంత చిన్న ట్రాఫిక్ జాం చూసినా, విన్నా నాకారోజు సంఘటనే మదిలో మెదులుతుంది. ఆ పాప క్షేమంగా ఉంది అని తెలిస్తే చాలు అనిపిస్తుంది. అందుకే మళ్ళీ అంటాను, రోడ్లు సరిగా వెయ్యక పోవడం, వేసిన వాటిని సరిగా చూడక పోవడం లాంటివి ప్రభుత్వాలు చేస్తున్న తప్పులైతే మనం చేసేవి కూడా ఎన్నో ఉన్నాయి అని. " అంది ఆవేదనగా. ఆమెతో ఏకీభవిస్తున్నట్టుగా మౌనంగా ఉండిపోయారు మిగతా ఇద్దరూ.

Click here to share your comments on this story